సాక్షి
నిజామాబాద్
గురువారం । 14 । మార్చి । 2024



మోగిన సమ్మె సైరన్

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రావాల్సిన బకాయిలు పేరుకుపోవడంతో కార్మికులు సమ్మెకు దిగారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
39.3 /26.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలితీవ్రత తగ్గే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు

- ఇద్దరు విద్యార్థులు డిబార్

నిజామాబాద్అర్బన్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ముగిశాయి. చివరి రోజు గణాంక శాస్త్రం, రసాయన శాస్త్రం పరీక్షలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా 18,825 మంది విద్యార్థులకు గాను 18,075 మంది ఎగ్జామ్‌కు హాజరయ్యారు. 750 మంది గైర్హాజరయ్యారు. ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. కోటగిరి జూనియర్ కళాశాలలో ఒకరు, జిల్లా కేంద్రంలోని సత్య వోకేషన్ జూనియర్ కళాశాలలో ఒకరు డిబార్ అయ్యారు. డీఐఈవో నాలుగు కళాశాలలను, ఫ్లయింగ్ స్క్వాడ్ 25 సెంటర్లను, సిట్టింగ్ స్క్వాడ్ 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

ముగ్గురు ఆర్డీవోలు బదిలీ

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బోధన్, ఆర్మూర్, బాన్సువాడ ఆర్డీవోలను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ అధికారిగా, బోధన్ ఆర్డీవో సిధం దత్తును వరంగల్ ఆర్డీవోగా, బాన్సువాడ ఆర్డీవో భుజంగరావును నిర్మల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్ఏ)గా బదిలీచేశారు. వారి స్థానంలో ఆర్మూర్ ఆర్డీవోగా వరంగల్ ఆర్డీవో స్రవంతి, బోధన్ ఆర్డీవోగా ఆదిలాబాద్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, బాన్సువాడ ఆర్డీవోగా ఆదిలాబాద్ మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేశ్ రాథోడ్ బదిలీపై రానున్నారు. బోధన్, ఆ ర్మూర్ ఆర్డీవోలు నెలరోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించగా, బాన్సువాడ ఆర్డీవో అసెంబ్లీ ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చారు.

ఆర్మూర్ చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 21న ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు నాటకీయ పరిణామాల మధ్య ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేసిన విషయం విదితమే. దీంతో ఈనెల 12న కలెక్టర్ ఉత్తర్వుల మేరకు వైస్ చైర్మన్ షేక్ మున్ను ఇన్‌చార్జి చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఎన్నికల సంఘం జారీచేసిన నోటిఫికేషన్ ఆధారంగా చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించనున్నారు. దీంతో చైర్‌పర్సన్ పీఠాన్ని ఆశిస్తున్న ఆశావహులు తమకు అనుకూలంగా ఉన్న కౌన్సిలర్లను క్యాంపునకు తరలించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్‌లో తిరుగుబాటు బావుటా ఎగురవేసి కాంగ్రెస్‌లో చేరిన 15 మంది కౌన్సిలర్లు ఎవరికి మద్దతు ఇస్తే వారికే చైర్ పర్సన్ పీఠం దక్కుతుందని బోధన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ ఇవ్వడంతో వారి నిర్ణయమే కీలకం కానుంది. ఏదిఏమైనా మూడు నెలలుగా ఉత్కంఠగా కొనసాగుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక అంకం త్వరలో కొలిక్కి రానుంది.

పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు తలెత్తవద్దు

నిజామాబాద్అర్బన్: పదో తరగతి పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ సూచించారు. నగరంలో పదో తరగతి పరీక్షలపై బుధవారం నిజామాబాద్ డివిజన్‌స్థాయి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యేడు పదో తరగతి విద్యార్థులకు ఏడు పరీక్ష పత్రాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు బిగించడం జరుగుతుందన్నారు. పరీక్ష కేంద్రాల్లో తప్పకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఇందుకోసం ఏర్పాట్లు ముందుగానే చేసుకోవాలన్నారు. పరీక్ష సిబ్బందిని నియమించాలని సూచించారు.

పరీక్షలు ముగియడంతో నగరంలోని ఓ కాలేజీ వద్ద విద్యార్థినుల ఆనందోత్సాహం



హాస్టల్ నుంచి ఇంటిబాట పట్టిన విద్యార్థులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు



ఇంటర్ విద్యార్థుల ఇంటిబాట

ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ముగియడంతోనే బుధవారం విద్యార్థులు ఉత్సాహంగా ఇంటిదారి పట్టారు. ఈ సందర్భంగా సందడి చేస్తూ కనిపించారు. జిల్లా కేంద్రంలోని కళాశాలల్లో చదువుతూ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులను తీసుకెళ్లేందుకు వారి తల్లిదండ్రులు, బంధువులు తరలివచ్చారు. వీరితో ప్రధాన బస్టాండ్‌లో రద్దీ కనిపించింది. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

గుర్తింపుపై నిర్లక్ష్యం!

- తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు తీసుకోని పలు కళాశాలలు
- ఉన్నత విద్యాశాఖకు లేఖ రాయనున్న వర్సిటీ అధికారులు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కొన్ని అనుబంధ కళాశాలల యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. వర్సిటీ పరిధిలో 73 అనుబంధ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటికి ప్రతియేటా వర్సిటీ అనుబంధ గుర్తింపు ఇస్తుంది. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో దాదాపు 22 కళాశాలలు ఇప్పటికీ వర్సిటీ అనుబంధ గుర్తింపు ఉత్తర్వులను తీసుకోలేదు. ఇందులో ప్రముఖ ప్రైవేటు కళాశాలలతో పాటు మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని సమాచారం. డిగ్రీ ప్రవేశాల సమయంలో యూనివర్సిటీ అనుబంధ గుర్తింపు ఉత్తర్వును ప్రతి కళాశాల దోస్త్ వెబ్‌సైట్‌తో పాటు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం సంబంధిత కార్పొరేషన్‌లకు సమర్పించాల్సి ఉంటుంది. అయితే 22 కళాశాలలు ఇప్పటికీ తమ అనుబంధ గుర్తింపు ఉత్తర్వులను వర్సిటీ నుంచి తీసుకోలేదు. దీంతో విద్యార్థుల సంక్షేమం పట్ల వారి నిర్లక్ష్య వైఖరికి నిదర్శనంగా నిలుస్తోందని విమర్శలు వస్తున్నాయి.

కళాశాలలకు వెబ్‌సైట్స్ లేవు

యూజీసీ నిబంధనల ప్రకారం కళాశాలలు వెబ్‌సైట్‌ను మెయింటెయిన్ చేయాల్సి ఉంటుంది. ఇందులో విద్యార్థులు, స్టాఫ్ వివరాలు, ఇతర అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాల్సి ఉంటుంది. అయితే తెయూ పరిధిలోని పలు కళాశాలలకు ఇప్పటికీ వెబ్‌సైట్స్ లేవు. ఈ విషయమై వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు ఎన్నిసార్లు చెప్పినా సంబంధిత కళాశాలల యాజమాన్యాలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. యూజీసీ నిబంధనలు పాటించకుండా, అనుబంధ గుర్తింపు ఉత్తర్వులు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్న కళాశాలల వివరాలను వచ్చే విద్యాసంవత్సరంలో దోస్త్ వెబ్‌సైట్‌లో పెట్టవద్దని కోరుతూ వర్సిటీ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యామండలికి, రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు సమాచారం. అలా అయితే పలు కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు లేకుండా పోయే అవకాశం ఉంది. అలాగే ఈ సారి ఏప్రిల్ మొదటివారం నుంచే అనుబంధ గుర్తింపు కోసం వర్సిటీ పరిధిలోని కళాశాలల తనిఖీలు చేపట్టేందుకు ఆడిట్ సెల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

నోటీసులిచ్చి..

సాధారణంగా ప్రవేశాలకు ముందే కాలేజీల్లో వర్సిటీ అధికారులు తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే గతేడాది ఈ సమయంలో అప్పటి వీసీ రవీందర్‌కు తన అవినీతి వ్యవహారం తలనొప్పిగా మారడంతో.. తనిఖీలు లేకుండానే కళాశాలల్లో ప్రవేశాలు కల్పించారు. జూలై 2023లో ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా ఘంటా చంద్రశేఖర్ నియామకమయ్యారు. దోస్త్ అడ్మిషన్లు పూర్తయిన తర్వాత సెప్టెంబర్ 11 నుంచి వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో అనుబంధ గుర్తింపు తనిఖీలు చేపట్టారు. అప్పటికే అడ్మిషన్లు పూర్తవడంతో కనీస వసతులు లేని కొన్ని కాలేజీలకు నోటీసులిచ్చి అనుబంధ గుర్తింపు ఇచ్చారు. అలాగే కళాశాలల్లోని బోధన సిబ్బందికి వర్సిటీ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. అయితే అధికారులు కొన్ని కళాశాలలకు సుమారు 15 ఏళ్లుగా టీచింగ్ స్టాఫ్ అప్రూవల్ నామమాత్రంగా ఇస్తున్నారు. ఆయా కళాశాలల యాజమాన్యాలు సమర్పించిన స్టాఫ్ అక్కడ నిజంగా పని చేస్తున్నారో లేదో తెలియదు. ఈ విద్యాసంవత్సరంలో అన్ని అనుబంధ కాలేజీల స్టాఫ్ అప్రూవ్స్ కొత్తగా చేయాలని ఆడిట్ సెల్ అధికారులు భావించారు. అయితే ఈ సారికి రెన్యువల్ చేయాలని వచ్చే విద్యాసంవత్సరంలో కొత్త అప్రూవ్స్‌కు వెళ్తామని కళాశాలల యాజమాన్యాలు విన్నవించడంతో రిజిస్ట్రార్ అనుమతించారు.

బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డి

- ప్రకటించిన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా బాజిరెడ్డికి పార్టీ టికెట్ కేటాయించింది. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటన చేశారు. మాస్ లీడర్‌గా పేరు పొందిన బాజిరెడ్డి గోవర్ధన్‌కు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో మంచి పట్టు ఉంది. సిరికొండ మండలం చీమన్‌పల్లికి చెందిన ఆయన తొలుత పోలీస్ పటేల్‌గా పని చేశారు. అనంతరం 1981లో చీమన్‌పల్లి సర్పంచ్‌గా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1987లో సిరికొండ ఎంపీపీగా ఎన్నికైన ఆయన 1992లో సిరికొండ పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. 1993లో రాష్ట్ర ఎస్‌ఎఫ్‌సీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అనంతరం రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. కాంగ్రెస్ నుంచి రెండు సార్లు, బీఆర్‌ఎస్ నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆర్టీసీ చైర్మన్‌గా కూడా విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బాన్సువాడ నియోజకవర్గాల్లో మంచి పేరు ఉంది. ఎంపీ నియోజకవర్గంలో మున్నూరుకాపు ఓట్లు ఎక్కువగా ఉండడం.. ఆయన కూడా ఇదే సామాజిక వర్గం కావడంతో బీఆర్‌ఎస్ అధినేత బాజిరెడ్డి వైపు మొగ్గుచూపారు. ఆయనకు టికెట్ కేటాయించడంతో జిల్లాలోని పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, బాజిరెడ్డి అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ బిగాల శుభాకాంక్షలు తెలిపారు.

'జహీరాబాద్' అభ్యర్థిగా అనిల్‌కుమార్

సాక్షి, కామారెడ్డి: జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి పేరు ఖరారైంది. గాలి అనిల్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు బీఆర్‌ఎస్ ప్రకటించింది. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ముగుడంపల్లి మండలం మాడ్గి గ్రామానికి చెందిన గాలి అనిల్‌కుమార్ పటాన్‌చెరు నియోజక వర్గంలో స్థిరపడ్డారు. కాగా ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా బీబీ పాటిల్, కాంగ్రెస్ అభ్యర్థిగా సురేష్ షెట్కార్‌లను ప్రకటించిన విషయం తెలిసిందే.

రాజకీయ నేతలను మించి..

- టీఎన్జీవోస్‌లో పదవుల కోసం వెంపర్లాట
- ఉద్యోగుల సమస్యలు గాలికొదిలి ఏళ్లుగా పదవుల్లో తిష్ట
- గెజిటెడ్ పోస్టుకు ప్రమోట్ అయినా టీఎన్జీవోస్‌ను వదలని అలుక కిషన్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పదవుల పందేరం విషయంలో రాజకీయ పార్టీల నాయకులు నిరంతరం ఎత్తులు, పైఎత్తులు, వ్యూహాలు రచిస్తుంటారు. అలాంటి రాజకీయ నాయకులు సైతం అవాక్కయ్యేలా కొందరు టీఎన్జీవోస్ పదవుల కోసం వెంపర్లాడుతున్నారు. సుదీర్ఘకాలం అతుక్కుపోయే విధంగా ఎత్తుగడలు వేస్తుండడం ఆశ్చర్యం గొలుపుతుంది. పదవులను కాపాడుకునేందుకు ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకుంటుండడం గమనార్హం. టీఎన్జీవోస్ ఉద్యోగ సంఘం బైలాకు సైతం తూట్లు పొడుస్తూ ఏళ్లతరబడి పదవులను పట్టుకుని వేలాడుతున్నారు. పైరవీలతో రూ. కోట్లు వెనకేసుకుంటూనే, మరోవైపు కొత్త తరం నాయకులను ఎదగకుండా తొక్కేస్తున్న తీరు విస్తుగొలుపుతోంది.

ఎనిమిదేళ్లుగా కీలక పదవిలో..

జిల్లా టీఎన్జీవోస్‌కు ఎనిమిదేళ్లుగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అలుక కిషన్ ఎనిమిదేళ్ల క్రితమే గెజిటెడ్ అధికారిగా(సర్వే ఇన్‌స్పెక్టర్) ప్రమోషన్ పొందారు. అయితే గెజిటెడ్ ఉద్యోగిగా మారితే బైలా ప్రకారం టీఎన్జీవోస్‌లో సభ్యత్వం కోల్పోతారు. అయినప్పటికీ ఇన్నేళ్లుగా పదవిలో కొనసాగుతూ వచ్చారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ కుమార్తె కవిత, అప్పటి మంత్రి ప్రశాంత్‌రెడ్డితో నిత్యం అంటకాగారు. ఆ పార్టీ గెలుపు కోసం అంతర్గతంగా సమావేశాలు సైతం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అవకతవకలపై ప్రశ్నించిన ఉద్యోగులు, ఉన్నతాధికారులకు మెమోలు ఇప్పించడం, బదిలీలు, డిప్యుటేషన్లు సైతం వేయించి వేధించినట్లు ఆరోపణలు ఉన్నాయి. యూనిఫాం సర్వీస్ శాఖలకు బైలా ప్రకారం టీఎన్జీవోస్‌లో అవకాశం ఉండదు. అయినప్పటికీ ఎక్సైజ్ శాఖ ఉద్యోగికి టీఎన్జీవోస్‌లో జిల్లా పదవి కట్టబెట్టారు. ఈ విషయాలపై కొందరు విశ్రాంత ఉద్యోగులు జీఏడీకి (సాధారణ పరిపాలన శాఖ) ఫిర్యాదు కూడా చేశారు. బైలాకు తూట్లు పొడిచి.. గెజిటెడ్ పోస్టులో ఉన్న వ్యక్తి టీఎన్జీవోస్ పదవికి పోటీచేసేలా ఏ విధంగా అనుమతిస్తారని విశ్రాంత ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా అలుక కిషన్‌కు టీఎన్జీవోస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి ఇప్పించేందుకు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత పైరవీలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రస్తుతం కాంగ్రెస్ నేతల చుట్టూ..

గతంలో కవిత, ప్రశాంత్‌రెడ్డితో అంటకాగిన అలుక కిషన్ ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి కోసం కాంగ్రెస్ నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు. మరోవైపు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిసేందుకు ప్రయత్నించగా, ఆయన విముఖత చూపినట్లు తెలుస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటిని కలిసిన నేపథ్యంలో ఆయన చురకలు పెట్టినట్లు తెలిసింది. ఎవరెవరు బీఆర్‌ఎస్ కార్యకర్తల మాదిరిగా పనిచేశారో, ఎక్కడెక్కడ ఏ విధంగా సమావేశాలు పెట్టారనే విషయాలపై అందరి చిట్టా తనవద్ద ఉందని అన్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ జెండాలు కప్పుకుని మరీ కిందిస్థాయి ఉద్యోగులను ఎలా ఇబ్బందులకు గురిచేశారో అన్నీ తెలుసని పొంగులేటి అన్నట్లు సమాచారం. ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి కానీ, అధికార పార్టీకి తొత్తుగా మాత్రం పనిచేయడం సరికాదని క్లాస్ ఇచ్చినట్లు సమాచారం.

మళ్లీ భూములు వదులుకోలేం!

- రైల్వేలైన్, వరద కాల్వ కోసం ఇప్పటికే నష్టపోయాం
- 63వ జాతీయ రహదారి విస్తరణలో బైపాస్‌లను వ్యతిరేకించిన రైతులు
- రసాభాసగా మారిన భూ సేకరణ అవగాహన సదస్సు
- రైతు సంఘాల ప్రతినిధులను అరెస్టు చేసిన పోలీసులు



సదస్సులో అధికారులతో వాగ్వాదానికి దిగిన మహిళా రైతులు

మోర్తాడ్(బాల్కొండ): రైల్వే లైన్, వరద కాలువల కోసం విలువైన పంట భూములను కోల్పోయాం ఇప్పటికే నష్టపోయి ఉన్నాం.. మళ్లీ నష్టపోవాలంటే ఎలా అంటూ రైతులు ప్రశ్నించారు. జాతీయ రహదారి 63 విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డును నిర్మించడానికి భూమి సేకరణ కోసం రెవెన్యూ యంత్రాంగం రైతులతో అవగాహన సదస్సును మోర్తాడ్‌లో నిర్వహించింది. భూములను కోల్పోవడానికి తాము ఎట్టి పరిస్థితుల్లో సిద్ధంగా లేమని అవసరమైతే కుటుంబాలతో సహా ఆత్మహత్య చేసుకుంటామని రైతులు అన్నారు. ఆర్మూర్ ఆర్డీవో రాజు గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మోర్తాడ్, గాండ్లపేట్‌లకు చెందిన రైతులు తమ కుటుంబాలతో సహా పాల్గొన్నారు. వరద కాలువ, రైల్వేలైన్‌ల నిర్మాణం కోసం ఎంతో విలువైన భూములను కోల్పోయి ఉన్న కొద్దిపాటి భూమిని నమ్ముకుని జీవిస్తున్న తమ పొట్టగొట్టే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని రైతులు ఆరోపించారు. రెవెన్యూ అధికారులు గతంలో సేకరించిన భూములు ఎవరివి? ఇప్పుడు సేకరిస్తున్న భూములు ఎవరివి? అని గుర్తిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మించే బదులు ఉన్న రోడ్డును విస్తరిస్తే వ్యవసాయ భూములకు నష్టం జరుగదని వారన్నారు. భూసేకరణ సదస్సులో తీవ్ర అభ్యంతరం తెలిపిన రైతు సంఘాల ప్రతినిధులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేయడంతో సమావేశం రసాభాసగా మారింది. ఈ సందర్భంగా ఆర్డీవో రాజుగౌడ్ రైతులతో మాట్లాడుతూ జాతీయ రహదారి అధికారులకు మరోసారి వినతి పత్రం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి, మోర్తాడ్ తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం సూరజ్ పోర్టల్'ను సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సుభాష్‌నగర్: ప్రధానమంత్రి సూరజ్ పోర్టల్ సేవలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఎస్సీ, ఓబీసీ, సఫాయి కర్మచారీ కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన ఈ పోర్టల్‌ను బుధవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. సఫాయి కార్మికులకు బీమా పథకం అందుబాటులోకి తెచ్చారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇతర అధికారులు, లబ్ధిదారులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, స్త్రీ నిధి ప్రాంతీయ మేనేజర్ రామ్‌దాస్, యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ శివ కోటయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్సీఎస్‌ఎఫ్ తెరిపించేందుకు కృషి

- ఫ్యాక్టరీని పునరుద్ధరించాలని సబ్‌కమిటీతో పాటు సీఎంను కోరాను
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- వారంలో ప్రభుత్వానికి నివేదిక : కలెక్టర్



ఫ్యాక్టరీ స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మోపాల్: సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తిరిగి తెరిపించాలని ప్రభుత్వం పట్టుదలతో ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. సారంగాపూర్‌లోని ఎన్సీఎస్‌ఎఫ్‌ను బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి ఆయన పరిశీలించారు. ఫ్యాక్టరీలోని యంత్రాలు, ఫ్యాక్టరీకి చెందిన స్థలాలను పరిశీలించి, రైతులు, రైతు నాయకులతో భేటీ అయ్యారు. కర్మాగారం పునరుద్ధరణ విషయమై రైతుల అభిప్రాయాలను సేకరించారు. ఫ్యాక్టరీని తెరిపించాలని రైతు ప్రతినిధులు కోరారు. ప్రభుత్వం తోడ్పాటునందిస్తే ఫ్యాక్టరీ పరిధిలోని రైతులు చెరుకు పండించేందుకు సిద్ధంగా ఉన్నారని వారు ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాంషుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. కమిటీ గత నెల చివరి వారంలో బోధన్ నిజాంషుగర్ కర్మాగారాన్ని సందర్శించిందని తెలిపారు. ఆ సమయంలో సారంగాపూర్ ఫ్యాక్టరీని సైతం పునరుద్ధరించాలని సబ్ కమిటీతో పాటు ముఖ్యమంత్రిని కోరానని పేర్కొన్నారు. దీంతో ఎన్సీఎస్‌ఎఫ్ స్థితిగతులపై నివేదిక అందించాల్సిందిగా జిల్లా యంత్రాంగాన్ని ప్రభుత్వం సూచించిందన్నారు. ఇందులో భాగంగానే కలెక్టర్‌తో కలిసి క్షేత్రస్థాయిలో కర్మాగారాన్ని సందర్శించానని తెలిపారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులతో కూడిన సమగ్ర నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రాజేంద్రకుమార్, శ్రీరాందత్తు, కర్మాగారం ఇన్‌చార్జి ఎండీ రవి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులు కొండెల సాయరెడ్డి, బొడ్డు గంగారెడ్డి, ఆకుల పాపయ్య పాల్గొన్నారు.

సరోజనమ్మకు అవార్డు



సరోజనమ్మ

బోధన్: బోధన్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు గుర్రాల సరోజనమ్మ చేసిన సామాజిక సేవలకు గుర్తింపు గాను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆమెను 'ఉమెన్స్ అచీవర్స్' రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేయనున్నారు. సరోజనమ్మ సామాజిక సేవ కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు లభించింది. పట్టణంలోని గోశాల రోడ్డులో సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే సొంత ఇంటిని సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్‌కు రాసిచ్చారు. అనాథ శవాలు, అద్దె ఇళ్లల్లో ఉండే వారి కుటుంబాల సభ్యులు మరణిస్తే అలాంటి వారికి అంతిమ సంస్కారాలు ఉచితంగా నిర్వహించుకునేందుకు రూ. 20 లక్షలు వెచ్చించి ధర్మస్థలం పేరుతో భవనం నిర్మించారు. నిజామాబాద్ నగరంలో మల్లు స్వరాజ్యం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనరిక్ మెడికల్ షాప్ నిర్వహణకు రూ. 2 లక్షలు ఖర్చుపెట్టి షెడ్డును నిర్మించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రం వద్ద గోవుల రక్షణ కోసం రూ. లక్ష ఖర్చు పెట్టి షెడ్డులను ఏర్పాటు చేయించారు. సరోజనమ్మ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికావడం గర్వకారణమని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంమోహన్‌రావు, యూనియన్ ఈపీఎస్ జిల్లా కన్వీనర్ అద్దంకి ఉషాన్ హర్షం వ్యక్తం చేశారు.

సేంద్రియ వ్యవసాయంలో మహిళా రైతుకు..



పుష్ప

ఎడపల్లి: సేంద్రియ వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచిన ఎడపల్లి మండలంలోని ఒడ్డెపల్లికి చెందిన మహిళా రైతు పుష్ప రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక అయ్యారు. రవీంద్ర భారతిలో ఆమె అవార్డు అందుకోనున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారు.

క్లుప్తంగా

నేడు బీజేపీ సమావేశం

సుభాష్‌నగర్‌: బీజేపీ నిజామాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ సమావేశాన్ని ఆర్మూర్‌ మండలం మామిడిపల్లిలోని విజయలక్ష్మి గార్డెన్స్‌లో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్‌ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ ధర్మపురి అర్వింద్‌, పార్లమెంట్‌ ఇన్‌చార్జి, శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అర్బన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్య దర్శి పల్లె గంగారెడ్డి, పార్లమెంట్‌ ప్రభారీ వెంకట్‌ రమణి హాజరుకానున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా పదాధికారులు, పార్లమెంట్‌, అసెంబ్లీ కన్వీనర్లు, కో కన్వీనర్లు, నాయకులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–2025 విద్యాసంవత్సరానికి గాను 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రాంతీయ సమన్వయ అధికారిణి కే అలివేలు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు www.tswreis.ac.in వెబ్‌సైట్‌ ద్వారా ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. తరగతులు, కులాల వారీగా ఖాళీలను వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. మిగిలిన సీట్ల భర్తీకి ఏప్రిల్‌ 21న బీఎల్‌వీసెట్‌ –2024 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని ఆర్‌సీవో తెలిపారు.

ప్రొఫెసర్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ పోస్టులకు..

నిజామాబాద్‌నాగారం: జిల్లా ప్రభుత్వ వైద్యకళాశాలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్‌, అసోసియేట్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, ట్యూటర్‌, సీనియర్‌ రెసిడెంట్‌ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఇందిర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి 15వ తేదీవరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఒరిజనల్‌ సర్టిఫికేట్లతో ఈ నెల 16న ఉదయం 11.00గంటలకు వైద్యకళాశాలలో ఇంటర్వ్యూకి హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.gmcnzb.orgను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉగాది కవితలకు ఆహ్వానం



నిజామాబాద్‌ సిటీ: క్రోధి నామ సంవత్సరం ఉగాదిని పురస్కరించుకొని సంస్కార భారతి ఇందూరు ఆధ్వర్యంలో పద్య, వచన కవితలను ఆహ్వానిస్తున్నట్లు సంస్కార భారతి కార్యాధ్యక్షులు గంట్యాల ప్రసాద్‌, కార్యదర్శి చామకూర శ్రీనివాసరెడ్డి తెలిపారు. నగరంలోని సంస్కార భారతి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా సంస్కార భారతి ఇందూరు శాఖ పక్షాన ఏప్రిల్‌ 9న కవితా సంకలనం తీసుకువస్తున్న సందర్భంగా, శ్రీరాముడు అయోధ్యలో తిరిగి కొలువైన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని 'అయోధ్య వైభవం' పేరిట కవితలను 18 లైన్లకు మించకుండా పంపించాలని కోరారు. వాట్సాప్‌లో కూడా టైప్‌ చేసి పంపించవచ్చని, అంశానికి తగిన విధంగా కవిత ఉండాలని సూచించారు. పరిశీలించిన తర్వాతే కవితలు ప్రచురిస్తామని తెలిపారు. కవులు, రచయితలు తాము రాసిన కవితలను ఈ నెల 25వ తేదీ వరకు 94403 56306, 99597 40505 నంబర్లకు పంపించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో నగుర్తి శంకర్‌, కందకుర్తి ఆనంద్‌, డాక్టర్‌ మద్దుకూరి సాయిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మోగిన సమ్మె సైరన్‌

- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు రూ.12 కోట్ల బకాయిలు
- ఇబ్బందుల్లో కార్మికులు
- 2023 నవంబర్‌ నుంచి విడుదల కాని నిధులు



మోర్తాడ్‌లో సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికులు

మోర్తాడ్‌(బాల్కొండ): మధ్యాహ్న భోజన ఏజెన్సీల బకాయిలు పేరుకుపోవడంతో కార్మికులు పాఠశాలల్లో మరోసారి సమ్మె సైరన్‌ మోగించారు. 2023 నవంబర్‌ నుంచి ఇప్పటి వరకు రూ.12 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, తాము ఎలా వంట చేసి పెట్టాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం మధ్యాహ్న భోజనం పెట్టలేదు. నూతనంగా వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం పాత బకాయిలు చెల్లించినప్పటికీ.. కొత్త బిల్లులను జమ చేయడంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని కార్మికులు ఆరోపిస్తున్నారు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 1,079 ఉన్నాయి. 2023 అక్టోబర్‌ వరకు బకాయి బిల్లులు మొత్తం రూ.10 కోట్లు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విడతల వారీగా చెల్లించింది. గత ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన బిల్లులను చెల్లించినప్పటికీ.. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడిన తరువాత కనీసం రెండు నెలలకు ఒకసారైనా బిల్లులు జమ చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతేడాది డిసెంబర్‌ నుంచి మధ్యాహ్న భోజనం కోడిగుడ్లు వడ్డించడాన్ని కార్మికులు నిలిపివేశారు. కేవలం పప్పు, కూరగాయల భోజనంతోనే సరిపెట్టారు. ఇప్పటికే ఏజెన్సీలకు బకాయిలు భారీగా పేరుకపోవడంతో సమ్మె చేయక తప్పడం లేదని కార్మికులు చెబుతున్నారు. బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు సమ్మె విరమించబోమని స్పష్టం చేస్తున్నారు.

ప్రభుత్వం స్పందించాలి

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించాలి. ఏజెన్సీల నిర్వాహకుల్లో పేద, మధ్య తరగతివారే ఉన్నారు. ప్రతినెలా బిల్లులు చెల్లిస్తేనే ఏజెన్సీలను కొనసాగించడం సాధ్యమవుతుంది. నెలల తరబడి బిల్లులు జమ చేయకపోతే కార్మికుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. – చక్రపాణి, మధ్యాహ్న భోజన ఏజెన్సీల సంఘం నాయకుడు

దేశాభివృద్ధిలో మహిళలే కీలకం



జెడ్పీ సీఈవో ఉషను సన్మానిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌నాగారం: దేశాభివృద్ధిలో మహిళలే కీలకమని, అన్ని రంగాల్లో రాణించినప్పుడే అది సాధ్యమవుతుందని జిల్లా పరిషత్‌ ఎగ్జిక్యూటీవ్‌ ఆఫీసర్‌ బి ఉష అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్‌ పెన్షనర్స్‌, రిటైర్డ్‌ పర్సన్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పెన్షనర్ల కుటుంబ సమ్మేళనాన్ని బస్వాగార్డెన్‌లో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఈవో ఉష మాట్లాడుతూ.. మహిళలు వివక్షను అధిగమించి శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాని పిలుపునిచ్చారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి రసూల్‌ బి మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతున్నారని, ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా సమాజహితం కోసం శ్రమిస్తున్నారన్నారు. అనంతరం శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కో కన్వీనర్‌ పద్మశ్రీ, తెలంగాణ యూనివర్సిటీ ప్రొఫెసర్‌ ఆరతి ప్రసంగించారు. ట్రెజరరీ డిప్యూటీ డైరెక్టర్‌ దశరథ్‌, వెల్‌నెస్‌ సెంటర్‌ కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ కృష్ణవేణి, నూర్జహాన్‌, శోభ, పుష్పవల్లి, దీన సుజన, బేబీ, మేరీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రిటైర్డ్‌ మహిళా ఉద్యోగులు వందన, ఇంద్ర, విమల, పుష్పవల్లి, ప్రేమలతను ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు జెడ్పీ సీఈవోను సన్మానించారు.

బోధన్‌ విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు

- చిత్ర కళాపోటీలో ప్రతిభ



అవంతి గీసిన నంది చిత్రం



అవంతి

బోధన్‌: వరంగల్‌ జిల్లాకు చెందిన సాగంటీస్‌ ఆర్ట్‌ అకాడమీ 'ఓరుగల్లు కళా వైభవం' పేరుతో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చిత్ర కళాపోటీలో బోధన్‌కు చెందిన విద్యార్థిని అవంతి ప్రతిభ కనబర్చి బెస్ట్‌ ఆర్టిస్ట్‌ అవార్డు అందుకుంది. మూడురోజుల క్రితం ఆన్‌లైన్‌లో పోటీలను నిర్వహించగా, పట్టణంలోని తట్టికోట కాలనీకి చెందిన అవంతి గీసిన నంది చిత్రాన్ని అవార్డుకు ఎంపిక చేశారు. అవంతి ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. అకాడమీ డైరెక్టర్‌, ప్రముఖ ఆర్టిస్టు సాగంటి మంజుల ప్రశంసాపత్రాన్ని అవంతికి పంపించారు.

చారిత్రక చక్రవర్తి కందకుర్తి యాదవరావు



యాదవరావును సన్మానిస్తున్న తెలుగు వెలుగు సంస్థ సభ్యులు

నిజామాబాద్‌ సిటీ: తెలుగు, ఉర్దూ, మరాఠీ, హిందీ భాషలపై పట్టుతో ఎన్నో పుస్తకాలను, వందలాది వ్యాసాలను రచించిన చారిత్రక చక్రవర్తి కందకుర్తి యాదవరావు అని ప్రముఖ సంఘసేవకుడు, న్యాయవాది రాజ్‌కుమార్‌ సుబేదార్‌ అన్నారు. తెలుగు వెలుగు సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో కందకుర్తి యాదవరావుకు జీవనసాఫల్య పురస్కారాన్ని సంస్థ అధ్యక్షుడు బి చంద్రశేఖర్‌ బుధవారం అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబేదార్‌ మాట్లాడుతూ.. దాదాపు ఐదు దశాబ్దాలుగా జిల్లా సాంస్కృతిక రంగానికి అపూర్వసేవలందిస్తున్న తెలుగు వెలుగు చంద్రశేఖర్‌రావు ఈ సంవత్సరం జీవన సాఫల్య పురస్కారాన్ని యాదవరావుకు అందించడం అభినందనీయమన్నారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, రుబాయిరాగాలు పుస్తక రచయిత డాక్టర్‌ కాసర్ల నరేశ్‌రావు మాట్లాడుతూ.. జిల్లా చరిత్రలో యాదవరావు భీష్ములని, 90 ఏళ్ల వయస్సులోనూ ఇంకా రచనలు చేస్తున్న ఆయన.. ఈతరం రచయితలకు ఆదర్శనీయులన్నారు. ఆత్మీయ అతిథులుగా హరికథాచార్యులు చిరంజీవాచార్యులు, రామ సూర్యప్రకాశ్‌రావు, నాగేశ్వరావు, కందకుర్తి ఆనంద్‌, విశ్వజిత్‌ పాల్గొన్నారు.

షాపింగ్‌ మాల్‌ సెల్లార్‌ సీజ్‌

- కోర్టు ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపల్‌ అధికారుల చర్యలు



షాపింగ్‌మాల్‌ సెల్లార్‌ను సీజ్‌ చేస్తున్న మున్సిపల్‌ అధికారులు

కామారెడ్డి టౌన్‌: మున్సిపాలిటీ అనుమతులు లేకుండా జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్‌ చౌరస్తాలో నిర్మించిన ఓ షాపింగ్‌ మాల్‌పై మున్సిపల్‌ అధికారులు బుధవారం కొరడా ఝుళిపించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్‌ కమిషనర్‌ సుజాత, టీపీవో గిరిధర్‌ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్‌ శాఖ సమక్షంలో భవనం సెల్లార్‌తోపాటు నాలుగో అంతస్తును సీజ్‌ చేశారు. రెండేళ్ల క్రితం మున్సిపల్‌ అధికారులు సీజ్‌ చేసినప్పటికీ అప్పటి ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చి తొలగించారనే ఆరోపణలున్నాయి. తాజాగా హైకోర్టు ఆదేశాల మేరకు రెండో సారి సీజ్‌ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రోడ్డులో అనుమతులు లేని సెల్లార్లు పెద్ద సంఖ్యలోనే ఉన్నాయని, వాటిపై సైతం చర్యలు తీసుకోవాలని పలువురు పేర్కొన్నారు. టీపీఎస్‌ రాజేశ్‌, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ల తయారీలో భారత్‌ ముందంజ



ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం వింటున్న తెయూ అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): 'వికసిత్‌ సంకల్ప్‌ భారత్‌' కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ రూ. 1.25 లక్షల కోట్ల విలువైన మూడు సెమీకండక్టర్‌ ప్రాజెక్టులకు శంకుస్థాపన కార్యక్రమాన్ని తెలంగాణ యూనివర్సిటీలోని సెమినార్‌ హాల్లో వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు బుధవారం ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యక్ష ప్రసారం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగిస్తూ.. స్వదేశీ పరిజ్ఞానంతో సెమీ కండక్టర్‌ రంగంలో భారతదేశం ముందంజలో ఉండడం గర్వకారణమన్నారు. రాబోయే రోజుల్లో సెమీకండక్టర్‌ డిజైన్‌, తయారీ, సాంకేతిక అభివృద్ధితో భారతదేశాన్ని గ్లోబల్‌ హబ్‌గా మారుతుందన్నారు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి సమన్వయకర్తగా రూసా నోడల్‌ ఆఫీసర్‌ వాసం చంద్రశేఖర్‌ వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, వైస్‌ ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ, ప్రొఫెసర్లు నసీం, లావణ్య, సంపత్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలిపేవారు అనుమతి తీసుకోవాలి

- నూతన ధర్నాచౌక్‌ కోసం స్థలం కేటాయింపు
- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు



ధర్నాచౌక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్‌, సీపీ

సుభాష్‌నగర్‌: ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపేందుకు నూతన ధర్నా చౌక్‌కోసం జిల్లా కేంద్రంలో వెయ్యి చదరపు గజాల స్థలాన్ని కేటాయించామని, నిరసనలు తెలిపేవారు ముందస్తుగా పోలీసుశాఖ అనుమతి తీసుకోవాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. నగరంలోని నూతన ధర్నా చౌక్‌ స్థలాన్ని పోలీస్‌ కమిషనర్‌ కల్మేశ్వర్‌తో కలిసి కలెక్టర్‌ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్త కలెక్టరేట్‌ వద్ద, పాత కలెక్టరేట్‌ ప్రధాన రోడ్డుకు ఆనుకుని నిరసనలు నిర్వహిస్తుండటం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కొత్తగా ధర్నా చౌక్‌ కోసం పాత కలెక్టరేట్‌ ఎదుట స్థలాన్ని కేటాయించామన్నారు. నిరసనలు తెలిపేవారి కోసం అవసరమైన సదుపాయాలు కల్పిస్తామన్నారు. సీపీ కల్మేశ్వర్‌ మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ముందస్తు అనుమతితో కొత్తగా ఏర్పాటు చేసిన ధర్నా చౌక్‌లోనే నిరసనలు తెలుపాలని సూచించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. వారివెంట నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సౌత్‌ తహసీల్దార్‌ బాలరాజు తదితరులున్నారు.

ఆహార కల్తీ నిరోధానికి కృషి

- అధికారులను అప్రమత్తం చేస్తాం
- వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి
- జిల్లా నూతన కమిటీ ప్రకటన



మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: ఆహార కల్తీని నిరోధించేందుకు నిరంతరం కృషి చేస్తామని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి అన్నారు. వినియోగదారుల సంక్షేమ సమితి ఇందూరు కమిటీని చక్రపాణి బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హానికరమైన రసాయనాలతో పాలు, ఇతర ఆహార పదార్థాల కల్తీ విషయమై సంబంధిత శాఖ నిర్లక్ష్యం చేస్తే వినియోగదారుల మండలి ద్వారా అనునిత్యం అప్రమత్తం చేస్తామన్నారు. ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి నూతన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా పెందోట అనిల్‌కుమార్‌, ఉపాధ్యక్షుడిగా వీఎస్‌ వర్మ, ప్రధాన కార్యదర్శిగా సందు ప్రవీణ్‌, కోశాధికారిగా మహదేవ్‌ శ్రీనివాస్‌, సంయుక్త కార్యదర్శులుగా కె.సాయికుమార్‌, పి.ప్రవళిక, కార్యవర్గ సభ్యులుగా బాణోత్‌ సందీప్‌ నియమితులైనట్లు పేర్కొన్నారు. వినియోగదారుల సమస్యలు, నాసిరకం ఔషధాలు, తూనికలు, కొలతల్లో మోసాలు, ఆహార కల్తీ, రసీదు లేని జీరో వ్యాపారం, హాల్‌ మార్కింగ్‌ విధానం, వెండి ఆభరణాల్లో సగం శాతం వరకు కల్తీ, అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం, కల్తీ విత్తనాలు, పురుగు మందులు, విచ్చలవిడి మైనింగ్‌ వల్ల పర్యావరణ సమస్యలు తదితర అంశాలపై చైతన్యపరిచే కార్యక్రమాలను కొత్త కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వివరించారు. వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెందోట అనిల్‌ కుమార్‌, సందు ప్రవీణ్‌ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలో వినియోగదారుల క్లబ్బులు, స్టాండర్డ్స్‌ క్లబ్స్‌ ఏర్పాటు చేసి విద్యార్థులను చైతన్య వంతులను చేస్తామన్నారు.

క్రమబద్ధీకరణ కలేనా?

- డిగ్రీ కళాశాల కాంట్రాక్ట్‌ లెక్చరర్లలో కొందరికే రెగ్యులరైజ్‌
- పీహెచ్‌డీ, నెట్‌, సెట్‌ ఆలస్యంగా పూర్తి చేసిన వారికి పెండింగ్‌
- జిల్లాలో 81 మందికి తప్పని నిరీక్షణ

మోర్తాడ్‌(బాల్కొండ): పీహెచ్‌డీ, నెట్‌, సెట్‌లను ఆలస్యంగా పూర్తి చేసిన డిగ్రీ కళాశాలల కాంట్రాక్టు అధ్యాపకులకు క్రమబద్ధీకరణ కలగానే మిగిలిపోతుందా? అనే సందేహం వ్యక్తమవుతోంది. సుమారు 23 ఏళ్లుగా కాంట్రాక్ట్‌ ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులు చాలీచాలని జీతాలతో జీవితాలను వెల్లదీస్తున్నారు. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కాంట్రాక్టు అధ్యాపకుల రెగ్యులరైజేషన్‌ కోసం జీవో నంబర్‌ 16 జారీ చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా 798 మంది అధ్యాపకుల్లో 332 మంది మాత్రమే రెగ్యులరైజేషన్‌కు అర్హత సాధించారు. జిల్లాలో 25 మంది రెగ్యులర్‌కాగా, 48 మందికి నిరీక్షణ తప్పడంలేదు. రెగ్యులరైజేషన్‌ కోసం పీహెచ్‌డీ పూర్తిచేసి లేదా నెట్‌, సెట్‌ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ప్రభుత్వం పీజీ పూర్తి చేసిన వారికి అవకాశం కల్పించింది. అయితే, గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రెగ్యులరైజ్‌ చేసే నాటికి కొంత మంది అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. కుటుంబ బాధ్యతలు, వయస్సు పెరిగిపోవడం ఇతరత్రా కారణాల వల్ల తమలో అనేక మంది పీహెచ్‌డీ, సెట్‌, నెట్‌ పరీక్షల్లో విఫలమయ్యారని వాపోతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి రెగ్యులరైజ్‌ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు కోరుతున్నారు.

గల్ఫ్‌ సంక్షేమ బోర్డు కోసం వినతులు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

మోర్తాడ్‌: ప్రవాసీ విధానంతో కూడిన గల్ఫ్‌ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తే వలస కార్మికులకు మేలు జరుగుతుందని జాయింట్‌ యాక్షన్‌ కమిటీ(జేఏసీ) నాయకులు అంటున్నారు. గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు హైదరాబాద్‌లో మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌, స్పీకర్‌ గడ్డం ప్రసాద్‌, వేములవాడ ఎమ్మెల్యే, విప్‌ ఆది శ్రీనివాస్‌, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలను అందచేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయించి గల్ఫ్‌ బోర్డుపై విధి విధానాలను రూపొందించేలా చొరవ తీసుకోవాలని కోరారు. జేఏసీ నాయకులు గుగ్గిల్ల రవిగౌడ్‌, దొనికెన కృష్ణ, స్వదేశ్‌ పరికిపండ్ల, చెన్నమనేని శ్రీనివాస్‌రావు, తోట ధర్మేందర్‌, టీపీసీసీ కన్వీనర్‌ మంద భీంరెడ్డి, గల్ఫ్‌ టీపీసీసీ కన్వీనర్‌ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, వినోద్‌కుమార్‌ ఉన్నారు.

మొరం క్వారీపై టాస్క్‌ఫోర్స్‌ దాడి

- 21 టిప్పర్లు, రెండు జేసీబీలు సీజ్‌



అధికారులు సీజ్‌ చేసిన టిప్పర్లు

మాక్లూర్‌: మండలంలోని సింగంపల్లి శివారులో అక్రమంగా కొనసాగుతున్న మొరం క్వారీపై టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం దాడి చేశారు. సీపీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్‌ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య సిబ్బందితో కలిసి మొరం క్వారీపై దాడి చేసి 21 టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్‌ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్‌, రాజేశ్వర్‌, రాములు, గజేందర్‌, అనిల్‌కుమార్‌ పాల్గొన్నారు.

టిప్పర్‌ పట్టివేత..

బోధన్‌రూరల్‌(బోధన్‌): మండలంలోని ఊట్‌పల్లి శివారు నుంచి అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

క్రైం కార్నర్‌

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

మాచారెడ్డి: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మ హత్యకు పాల్పడిన ఘటన పాల్వంచ మండలం మంథని దేవునిపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్దంగుల నర్సింలు(27)కు ఐదు సంవత్సరాల క్రితం రామేశ్వర్‌పల్లికి చెందిన దివ్యతో వివాహమైంది. గొడవల కారణంగా దివ్య ఆరు నెలల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురైన నర్సింలు మంగళవారం రాత్రి ఇంట్లోని దూలానికి చున్నీతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్యాన్సర్‌తో బాధపడుతున్న వృద్ధురాలు..

మాక్లూర్‌: క్యాన్సర్‌తో బాధపడుతున్న మండలంలోని ముల్లంగి(బి)కి చెందిన నీరడి సాయమ్మ(74) ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుందని ఎస్సై సుధీర్‌రావు తెలిపారు. కోడలు నీరడి సురేఖ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రైలుకింద పడి ..

కామారెడ్డి క్రైం/భిక్కనూరు: కుటుంబ కలహాల కారణంగా రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. భిక్కనూరు – అక్కన్నపేట రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మెదక్‌ జిల్లా రామాయంపేట మండలం తోనిగండ్ల గ్రామానికి చెందిన పుర్ర ప్రవీణ్‌(26) లిఫ్ట్‌ మెకానిక్‌గా పనిచేసేవాడు. కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ప్రవీణ్‌ మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులను విచారించగా, కుటుంబ కలహాలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తావూ నాయక్‌ తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ఒకరి మృతి



భిక్కనూరు: చేపల వేటకు వెళ్లిన యువకుడు మండల కేంద్రంలోని బొబ్బిలి చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు భిక్కనూర్‌ ఎస్సై సాయికుమార్‌ బుధవారం తెలిపారు. దినసరి కూలీగా పనిచేసే వేణుగోపాల్‌(35) బుధవారం బొబ్బిలి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి నీట మునిగాడు. అక్కడే ఉన్న వారు గమనించి వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. కొద్దిసేపటి తరువాత మృతదేహం పైకి తేలడంతో చెరువులోనుంచి బయటికి తీశారు. మృతుడి తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌ గ్రామానికి చెందిన మునిగేపల్లి కృష్ణవేణి (21) అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం నుంచి తన కూతురు కనిపించడం లేదని తండ్రి రాజయ్య ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదం

- షార్ట్‌సర్క్యూట్‌తో టిఫిన్‌ సెంటర్‌, ఇల్లు దగ్ధం



ముత్యంపేటలో దగ్ధమైన టిఫిన్‌సెంటర్‌ సామగ్రి

దోమకొండ/రుద్రూర్‌: విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా దోమకొండ మండలం ముత్యంపేట, పోతంగల్‌ మండలం హెగ్డోలిలో బుధవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ముత్యంపేటకు చెందిన తమ్మిడి నరేశ్‌కు చెందిన టిఫిన్‌ సెంటర్‌లో అగ్నిప్రమాదం కారణంగా రూ.2లక్షల విలువైన సామగ్రి దగ్ధమైంది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. పోతంగల్‌ మండలం హెగ్డోలిలో మల్లికార్జున్‌కు చెందిన ఇంట్లో ఫర్నిచర్‌ దగ్ధమైంది. స్థానికుల సమాచారం మేరకు రెవెన్యూ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ.లక్షా72వేల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఆటోబోల్తా.. మహిళలకు గాయాలు

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని జానకంపేట నుంచి ఠాణాకలాన్‌ వైపు వెళ్తున్న ఆటో పంది అడ్డురావడంతో రతన్‌కుంట వద్ద ప్రధాన రోడ్డుపై బోల్తాపడింది. ఈ ఘటనలో ఐదుగురు మహిళలకు గాయాలయ్యాయి. బాధిత మహిళలను స్థానికులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్‌

బోధన్‌రూరల్‌(బోధన్‌): బోధన్‌ పట్టణ శివారులోని శ్రీనివాస్‌ క్యాంప్‌ సమీపంలో అతివేగంతో వెళ్తున్న ఇసుక ట్రాక్టర్‌ అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. డ్రైవర్‌ అజాగ్రత్తగా అతివేగంగా నడపడంతోనే ట్రాక్టర్‌ పంట పొలాల్లోకి దూసుకెళ్లిందని స్థానికులు తెలిపారు. ప్రమాదసమయంలో ఎదురుగా వాహనలు, వ్యక్తులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని వారు పేర్కొన్నారు.